

హైదరాబాద్ వార్త

# బిజెపికి బారులు తీరారు

## ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు భారీగా దరఖాస్తులు

## ఆ రెండు పార్టీలనూ గమనించి దీటైన అభ్యర్థి కోసం అన్వేషణ

హైదరాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : ఎన్నికల హడావుడి నడుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నాయి. ఎలాగైనా ఈసారి బిఆర్ఎస్‌ను ఓడించి.. తాము అధికారం దక్కించుకోవాలని విపక్ష పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే తమ వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే గెలుపు గుర్రాల వేట స్టార్ట్ చేశాయి. మొన్న కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల టికెట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా విశేష స్పందన వచ్చింది. అర్హులైన ఆశావాహుల పేర్లతో జాబితాను, సీల్డ్ కవర్‌లో ఏఐసిసికి పంపింది. కాగా ఇప్పుడు బిజెపి కూడా కాంగ్రెస్ దారిలోనే నడుస్తోంది. ఔత్సాహికుల నుంచి అప్లికేషన్ల ఆహ్వానించగా..కమలం పార్టీకి భారీగా స్పందన వచ్చింది. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న చాలా మంది నేతలు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చారు. రాష్ట్రంలో కేవలం ముగ్గురంటే ముగ్గురే ఎమ్మెల్యేలున్న కమలం పార్టీకి 119 స్థానాల్లో నిలబెట్టేందుకు అభ్యర్థులు కూడా లేరంటూ అధికార పార్టీ నేతలు విమర్శించారు. అలాంటిది ఇప్పుడు పోటీకి నిలబడేందుకు భారీగా ఆశావాహులు దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే దరఖాస్తులకు బిజెపి ఫీజు పెట్టకపోవడంతో చాలా మంది అప్లికేషన్స్ చేసుకున్నారు. మొత్తం ఆరువేల వరకు దరఖాస్తులు వచ్చాయంటే బిజెపికి ఎంత డిమాండ్ ఉందో అర్థం అవుతోంది. బల్దియా ఎన్నికల్లో 48 డివిజన్లను సొంతం చేసుకున్న ఆపార్టీకి ప్రస్తుతం 44 మందికే పరిమితమైంది.బిజెపి తరపున పోటీ చేసేందుకు నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇంట్రెస్ట్ చూపించారు.కాగా నగరంలో ఒక్కో నియోజకవర్గానికి 10 వరకు దరఖాస్తులు రాగా కొన్ని చోట్ల 40కిపైగా వచ్చాయి.రాష్ట్ర వ్యాప్తంగా ఆరువేలకుపైగా దరఖాస్తులు వస్తే గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాలకు అందులో 40 శాతానికిపైగా వచ్చాయని పార్టీ వర్గాలు తెలిపాయి,కాగా బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ధీటుగా అభ్యర్థిని నిలపడానికి అన్వేషిస్తున్నారు.

• అంబర్‌పేట నియోజకవర్గం నుంచి బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, పార్టీ సీనియర్ నాయకులు గీతామూర్తి, బి.వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ వనం రమేష్‌లు దరఖాస్తు చేసుకున్నారు •ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మీ, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సూర్యనారాయణశర్మ, బిజెవైఎం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌గౌడ్, భాగ్యనగర ఉత్సవ కమిటీ నగర అధ్యక్షుడు వినయ్, ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు సికె శంకర్ తదితరులు ఉన్నారు • ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు రామన్‌గౌడ్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్, ఎన్‌వి సుభాష్, గోవర్ధన్, మోచినేని శ్రీనివాసరావు, బొల్లంపల్లి ఇంద్రాసేనారెడ్డి ఉన్నారు • జూబ్లీహిల్స్ నుంచి పార్టీ సీనియర్ నాయకులు లంకల దీపక్‌రెడ్డి, పార్టీలో కొత్తగా చేరిన కీర్తిరెడ్డి, మహిళా మోర్చా నగర అధ్యక్షురాలు అనంత లక్ష్మీ తదితరులు ఉన్నారు • కార్వాన్ నుంచి టి.అమర్‌సింగ్, దేవర శ్రీనివాస్, జి.శివరత్నం, కట్ల అశోక్, జి.సునిల్‌యాదవ్, బోడి అన్నూయాదవ్, బి.దర్శన్, రావుల మాణిక్ ప్రభులు దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు • గోషామహల్ నుంచి ఎం.విక్రమ్‌గౌడ్, గోల్కొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు పాండుయాదవ్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంతరావు, పార్టీ సీనియర్ నాయకులు వనమాల గోపాల్, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, కిసాన్ మోర్చ నగర కార్యదర్శి ముక్క కృష్ణగుప్తా, గోల్కొండ జిల్లా కార్యదర్శి రఘునందన్ యాదవ్ ఉన్నారు • చార్మినార్ నుంచి ఉమామహేంద్ర, చేతన్‌కుమార్ సూరి, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, నిత్యఫారేఖ్, అశోక్‌సేన్, ఎం.కుమార్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు • యాకుత్‌పుర నుంచి సహదేవ్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, వీరేంద్రబాబు, రాజేశ్వర్, చర్మని రూప్‌రాజ్, దశరథలక్ష్మీ, జమాల్‌పూర్ అశోక్, జంపాల మధు, ఆర్.ఈశ్వర్‌యాదవ్, అనిఫ్‌అలీ, మీర్జా అఖిల్ ఆఫాది, నళిని గౌడ్, రమేష్‌యాదవ్,పుప్పల మధుసూదన్‌రావులు ఉన్నారు • చంద్రాయణగుట్ట నుంచి ఊరటి సత్యనారాయణ, సయ్యద్ షహజాది, వరలక్ష్మీ, పొన్న శ్రీనివాసారావు, వెంకటేష్, డాక్టర్ పండరీ జాని, రాజ్‌కుమార్, చిరంజీవి, పండరీనాథ్‌లు ఉన్నారు • కుత్బుల్లాపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ఓబిసి సెల్ రాష్ట్ర నాయకుడు దివాకర్, మాజీ నియోజకవర్గ కన్వీనర్ శంకర్‌రెడ్డి, కొంపల్లి బిజెపి ఫ్లోర్‌లీడర్ రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహా ఉన్నారు • కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, పన్నాల హారీష్‌రెడ్డి ఉన్నారు • ఎల్బీనగర్ నుంచి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు పి.నరేష్ యాదవ్, సీనియర్ నాయకులు కటకం నర్సింగరావు, యశ్పాల్‌రెడ్డి ఉన్నారు • శేరిలింగంపల్లి నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్, సీనియర్ నేత గజ్జల యోగానంద్, కె.నరేష్ ఉన్నారు • రాజేంద్రనగర్ నుంచి అత్యధికంగా 52 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొక్క బాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్; బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ తదితరులు ఉన్నారు. వీరిలో తోకల శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం • ఉప్పల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు • మేడ్చల్ నుంచి ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, జగన్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జహంగీర్, సంతోష్‌లు తదితరులు దరఖాస్తులు చేసుకున్నారు.

# పరపతుల పబ్బులు

### అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలు
### కోరుకున్న సౌకర్యాలు.. అడ్డగోలు రేట్లు
### నిబంధనలకు విరుద్దంగా నిర్వాహణ
### ఎస్సార్‌నగర్‌లో పబ్‌పై పోలీసుల దాడులు
### అశ్లీల నృత్యాలు చేస్తున్న 30మంది అరెస్ట్



హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: నగరంలో పబ్బు.. గబ్బు సంస్కృతి రోజురోజుకి పెరిగిపోతూనే ఉంది. ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పబ్‌లను నిర్వహిస్తున్నారు. వీకెండ్ వచ్చిందంటే చాలు నగరంలోని ఖరీదైన ప్రాంతాలుగా గుర్తింపు పొందిన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, బేగంపేట్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో జనాలు గుమిగూడటమే కాకుండా,పబ్ పరిసర ప్రాంతాలు పూర్తిగా రద్దీగా మారిపోతుంటాయి. పబ్‌లముందు అంతా ఇంత ఉండదు. పబ్‌లకు వచ్చేకస్టమర్లకు నిర్వాహకులు అన్ని సర్వీసులు అందిస్తున్నారు. కస్టమర్లు కోరకుందే తడువుగా వారికి ప్రత్యేక గదులు కేటాయించడంతో పాటు హుక్కా, నుండి మొదలు, డ్రగ్స్ వరకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. అడపాదడపా దాడులు నిర్వహించే ఎక్సైజ్ అధికారులు నోటీసుల ఇచ్చి సరిపెట్టుకుంటున్నారు. ఒక మాఫియాలా తయారైన పబ్ నిర్వాహకులు, నిబంధనలను తుంగలోతొక్కుతున్నారు. పబ్‌ను నిర్వహించాలంటే పలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. అందులో పోలీస్, ఎక్సైజ్ నిబంధనలు పాటించకపోతే అంతే సంగతులు. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ నిబంధనలను తమకు పట్టవన్నట్టుగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా మైనర్లను అనుమతి నుండి మొదలుకొని తెల్లవారే వరకు పబ్‌లను నిర్వహిస్తున్నారు. అంతేకాదు సరఫరా చేసే మద్యానికి ఎలాంటి నిర్ణయించిన ధరల పట్టిక లేకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక ప్రేమ జంటలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తూ వారికి పూర్తి స్వేచ్ఛను కల్పిస్తున్నారు.

**ఆప్రాంతాల్లోనే ఎక్కువ..** నగరంలోని జూబ్లిహిల్స్, బంజావారాహిల్స్‌లతో పాటు పంజాగుట్ట ప్రాంతాల్లో 45వరకు పబ్‌లు ఉన్నాయి. ఒక్కజూబ్లీ హిల్స్‌లోనే 30పబ్బులు నడుస్తున్నాయి. వీటిపై ఇప్పటికే అనేక ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఏరీతితో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖరీదైన పబ్బుగా పేరొందినవాటి నుండి మామూలు పబ్‌లపైన దాదాపు పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. మైనర్లను అనుమతించటం, అర్థరాత్రి వరకు పబ్‌లు తెరిచిఉంచడం, హుక్కాతో పాటు, డ్రగ్స్ సరఫరా చేసినందుకుగాను వీటిపై కేసులు నమోదయ్యాయి. అయినా పబ్‌నిర్వాహకులు మాత్రం తమను ఎవరూ ఏమి చేయలేరన్న చందంగా వ్యవహరిస్తున్నారు. అయితే పబ్‌ల అడ్డగోలు బాగోతంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏమాత్రం ముందుకు రావడంలేదు. కేవలం మీడియాలో వచ్చిన కథనాలతో పాటు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న సమయంలో మాత్రమే తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నోటీసులు ఇవ్వడం ఆతర్వాత ఉల్లంఘించిన మేరకు 15రోజుల నుండి మొదలు ఆరు నెలల వరకు పబ్‌ల లైసెన్స్ రద్దుచేసే అధికారం ఆబ్కారీ అధికారులకు ఉంటుంది. కానీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా వెనకుడగు వేస్తున్నారు. పబ్‌లపై చర్యలు తీసుకునే సదరు అధికారులపై రాజకీయ నేతల ఒత్తిడి కూడా పెరిగిపోతుందని తెలుస్తోంది.

### ఎస్ఆర్‌నగర్‌లో పబ్‌పై పోలీసులు దాడులు.. 30మంది అరెస్ట్

ఎస్సార్‌నగర్‌లోని హంటర్ రెస్టోబార్ అండ్ పబ్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమలు లేకుండా పబ్ నిర్వహించడంతోపాటు అమ్మాయిలతో అశ్లీలంగా డ్యాన్సులు చేయిస్తూ ,లిక్కర్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో మొత్తం 30మంది అరెస్ట్ చేశారు. పబ్‌లో 10మంది అమ్మాయిలు డ్యాన్సులు చేస్తుండటం, కొందరు యువకులు వారితో అసభ్యంగా ప్రవర్తించటాన్ని పోలీసులు గుర్తించారు. బార్‌అండ్ పబ్ నిర్వహించేందుకు సరైన అనుమతి కూడా లేకపోవడంతో యజమాని కృష్ణ, ఈవెంట్ ఆర్గనైజర్ ఒమర్ బిన్‌అబ్దుల్లా, క్యాషియర్ సిద్దార్థ్, డిజె ఆపరేటర్ కృష్ణతోపాటు 10మంది అమ్మాయిలు, 16మంది యువకులను అరెస్ట్ చేశారు. తదుపరివిచారణ నిమిత్తం ఎస్ఆర్ నగర్ పోలీసులకు అప్పగించారు.

## వైభవంగా అభినయ 17వ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు



చోమనదూడి నాటకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, సంగీత నాటక అకాడమీ, అభినయ థియేటర్స్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్-2023లో 3రోజుల ప్రతిష్టాత్మక 17వ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు బహుభాషా నాటక ప్రదర్శనల్లో 6.30గంటలకు కర్ణాటకలోని ఒక గ్రామంలో అంటరాని అట్టడుగు కులానికి చెందిన చోమ గురించి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. శివరామ్‌కారంత్ నవల ఆధారంగా చంద్రు దర్శకత్వంలో రూపాంతర బెంగళూరు వారిచే చోమనదూడి కన్నడ నాటకం; 8గంటలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని అమాయక స్నేహపూర్వక గ్రామం నేపథ్యంలో మానవ భావోద్వేగాలు, దృకత్పథం, సంబంధాల ఛాయలతో, తాదాత్మ్యం, కరుణ, నైతికత, న్యాయం యొక్క నిర్వచనంపై ఆత్మపరిశీలన చేసుకునేలా చేసే కథాంశంతో డా. రాజేంద్ర చవాన్ రచన, అభిలాష కులకర్ణి దర్శకత్వంలో రంగాధార హైదరాబాద్ వారిచే చత్రీ మరాఠీ నాటికలు జనరంజకంగా ప్రదర్శించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమానికి అతిథులుగా ప్రముఖులు డా. ఎస్.చెల్లప్ప, దీపికారెడ్డి, డా. మామిడి హరికృష్ణ, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు



ఘాన్సీబజార్ డివిజన్‌లో ప్రమాదకరంగా మారిన ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు

చార్మినార్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చుటూ ఫెన్సింగ్ లేకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయ పడుతున్నారు. ఘాన్సీ బజార్ డివిజన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచెలను సంబంధిత అధికారులు ఏర్పాటు చేయకపోవటం పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఘాన్సీ బజార్‌లోని రైల్‌గాడి భవనం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫెన్సింగ్ లేనందున వర్షం పడే సమయంలో ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి వెళ్లాలంటేనే సందేహిస్తున్నారు.దీనికితోడు రహదారి చాలా చిన్నదిగా ఉంది.నిత్యం ట్రాఫిక్ సమస్య ఇక్కడ ఏర్పడుతుంది. కంచే లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటేనే స్థానికులు భయ పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డును ఆనుకుని ఉంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వాహనదారులు వాహనాలను నడిపిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కనే ఉన్న విద్యుత్ వైర్లను తాకుకునే ప్రమాదం.ఘాన్సీ బజార్ డివిజన్ నుంచి ప్రతీ నెల లక్షలాది రూపాయలు విద్యుత్ బిల్లులు వసూళ్లు అవుతుంటాయి.అధికారులు విద్యుత్ బిల్లులను మాత్రమే వసూళ్ల చేస్తున్నారు తప్ప ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను మాత్రం ఏర్పాటు చేయకపోవటం పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా అగర్వాల్ కళాశాల సమీపంలోని రికాబ్‌గంజ్ వస్త్రాల మార్కెట్‌లో కూడ ఇదే పరిస్థితి నెలకుంది. నిత్యం వేలాది మంది మహిళలు వస్త్రాల మార్కెట్లలో పలు రకాల వస్త్రాలు ఖరీదు చేయటానికి వస్తుంటారు. ఇక్కడ రహదారి కనీసం ఆరు అడుగులు వెడల్పు కూడ లేదు.రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ లేనందున మహిళలు, స్థానిక ప్రజలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి నడిచి వెళ్లటానికి నిరాకరిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## గోషామహల్ నియోజకవర్గం బిజెపిలో గందర గోళం

గోషామహల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో 2018 జరిగిన ఎన్నికల్లో ఏకైక బిజెపి శాసనసభ్యులుగా గెలిచిన టి.రాజాసింగ్,మరో రెండు నెలలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి బిజెపి టిక్కెట్ దక్కేనా అనే అనుమానం కలుగుతుంది. బిజెపిలో ముందు ఎన్నాడు లేని విధంగా శాసనసభకు పోటి చేసే వారు ధరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ బిజెపి అధిష్టానం పిలుపు నివ్వడంతో ఏకంగా గోషామహల్ నియోజకవర్గం నుంచి సుమారు 15మందికిపైగా బిజెపి టిక్కెట్ ధరఖాస్తు చేసుకున్నారు.ఓ మతంపై వివాదాస్పధ వ్యాఖ్యాలు చేసినందుకు బిజెపి కేంద్ర పార్టీ రాజాసింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఏడాది దాటినప్పటికి ఇప్పటి వరకు సస్పెండ్‌ను ఎత్తివేయాలేదు.అంటే గోషామహల్ నియోజకవర్గం నుంచి రాజాసింగ్‌ను తప్పించడం ఖాయమని తెలుస్తుంది. ఒక వేళ రాజాసింగ్‌పై సస్పెండ్ ఎత్తివేస్తే బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓ మతంపై వివాదస్పదా వ్యాఖ్యాలు చేసిన వ్యక్తి తిరిగి బిజెపి పార్టీలో చేర్చుకుని టిక్కెట్ ఇచ్చారని ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటారని బిజెపి పెద్దలు భావిస్తున్నట్లు తెలిసింది.గోషామహల్ నియోజక వర్గం బిజెపి నుంచి నాలుగుసార్లు గెలిచిన కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్,గోల్కొండ బిజెపి అధ్యక్షులు వి.పాండుయాదవ్,గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు,బిజెపి నాయకులు గోవింద్ రాఠి, దళితమోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా,మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్,రఘు నందన్ యాదవ్ పలువురు బిజెపి నాయకులు గోషామహల్ నియోజకవర్గం బిజెపి టిక్కెట్ కోసం ధరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త బిజెపి టిక్కెట్ కోసం ధరఖాస్తు చేసుకున్నారు.తెలంగాణ బిజెపి ఎవరికి టిక్కెట్ ఇస్తుందో వేచి చూడాల్సిందే. ఎవరికి వారే విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

## నీళ్లు ఇలా.. నడిచేది ఎలా?

### కార్మికశాఖ కార్యాలయం ప్రధాన గేట్ల వద్ద నిలిచిపోతున్న నీరు.. పాదచారుల తీవ్ర ఇబ్బందులు



కార్మికశాఖ కార్యాలయం ఎంట్రన్స్‌లో నిలిచిపోయిన నీరు

హైదరాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త: కార్మికశాఖ కార్యాలయం ప్రధాన గేట్ల వద్ద నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిలిచిపోయి, రోజుల తరబడి ఆ నీరు అలాగే ఉండిపోతూ ఉండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. కార్మిక శాఖ కార్యాలయంకు నిత్యం పేద కార్మికులు తమ అవసరాల కోసం నడుచుకుంటూ వస్తూ ఉంటారు. వర్షం పడితే చాలు వారు లోపలికి రావటం పెద్ద సమస్యగా తయారవుతోంది. చాలా కాలంగా ఈ సమస్య ఇక్కడ ఉన్నప్పటికీ, ఎవరూ పట్టించుకోక పోవటంతో కార్యాలయంకు వచ్చే కార్మికులు నీళ్లు ఇలా ఉంటే మేం ఎలా నడిచేది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం లేబర్ కమీషనర్‌లు పెద్ద పెద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఇక్కడ నుండి కారుల్లో వెళ్తూ ఉంటారు కానీ ఈ సమస్యపై వారెవరూ స్పందించక పోవటం, పాదచారుల ఇబ్బందిని చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ఉండటం విశేషం. ఇప్పటికైనా ఇక్కడ నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కార్యాలయంకు వచ్చే కార్మికులు కోరుతున్నారు.

## నల్లకుంటలో బ్రమ్మాకుమారీల శాంతిర్యాలీ



నల్లకుంటలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు శ్రీలత, సురేఖ, కార్పొరేటర్ ఎన్.అమృత

హైదరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: నల్లకుంటలో సోమవారం తిలక్‌నగర్ విభాగానికి చెందిన బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు శాంతిర్యాలీ నిర్వహించారు. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి హిందీ మహావిద్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ ఎన్.అమృత, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు శ్రీలత, సురేఖలు పాల్గొని మాట్లాడారు. సమాజంలో శాంతిని, సంతోషాన్ని పెంపొందించాలని, మహిళల విద్య, ఆరోగ్యం, భద్రత, సమాజంలో చెడు అలవాట్లను దూరం చేయడం తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు టి.రాంమోహన్, కె.సత్యనారాయణ, కె.నర్సింగ్‌రావు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### గణేష్ నవరాత్రి ఉత్సవాలకు గట్టిబందోబస్తు : డిసిపి సాయి చైతన్య



చార్మినార్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు,మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్య అన్నారు.పాతబస్తీ కిల్వత్‌లోని ఉర్దూమస్కాన్‌లో సోమవారం దక్షిణ మండలం శాంతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను జరుపుకుని తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని కోరారు.దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్,చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్,మీర్‌చౌక్ ఎసిపి వెంకటేశ్వరరావు,ఫలక్‌నుమా ఎసిపి సుధాకర్,ఛత్రినాక్ ఎసిపి రమేష్,హుస్సేనీఆలం సిఐ నాగేశ్వర్‌రెడ్డి,ఆల్ జోన్స్ శాంతి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకిషన్ శర్మ,సౌత్ జోన్ పీస్ కమిటి ప్రతినిధులు హాఫీజ్ ముజాఫర్,సంపత్ తోష్నివాలా,మొయినుద్దీన్‌తో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### గృహలక్ష్మీ, ఆసరా ఫించన్ల పరిశీలన త్వరగా పూర్తిచేయండి
### అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



ఆర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని అన్నారు. వివిధ మండలాల తహసీల్దార్‌లతో మాట్లాడుతూ జివో 58, 59 కింద వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అలాగే గృహలక్ష్మీ, ఆసరా ఫించన్లు త్వరగతిన పరిశీలిన పూర్తి చేసి అన్లైన్‌లో నమోదు చేయాలని తెలపారు. అలాగే విద్యా, ఆరోగ్య, దేవాదాయ శాఖలలో అపరిష్కృతంగా ఉన్న ఆర్జీలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సోమవారం ప్రజావాణిలో 180 ఆర్జీలు రాగా అందులో గృహనిర్మాణశాఖకు 120, ఇతర శాఖలకు సంబంధించి 60 వచ్చాయని తెలిపారు. అలాగే ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15న డబుల్‌బెడ్‌రూం ఇండన్ల లబ్దిదారుల ఎంపిక జిహెచ్‌ఎంసి పరిధి లోని మొత్తం 24నియోజకవర్గాలకు ర్యాండమైజేషన్ ప్రక్రియ తమ కార్యాలయంలోనే ఉంటుందని ఇది మనపై పెట్టిన బాధ్యత అన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపులో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఎస్సీ,ఎస్టీ, బిసి, వికలాంగులకు ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డిఆర్‌వో వెంకటాచారి, ఆర్డీవోలు సూర్యప్రకాశ్, రవికుకుమార్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా నటి జీవిత రాజశేఖర్ దరఖాస్తు



కిషన్‌రెడ్డికి దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న జీవిత రాజశేఖర్

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాత వార్త : ప్రతిష్టాత్మక జూబ్లీహిల్స్ నియోజకవర్గం భాజపా అభ్యర్థిగా ప్రముఖ నటి జీవిత రాజశేఖర్ దరఖాస్తు చేయడంతో కొత్త చర్చ మొదలైంది. మొదటి నుంచి భారతీయ జనతా పార్టీలో పని చేస్తున్న జీవిత దరఖాస్తు దాఖలుకు చివరి రోజున ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో దరఖాస్తు ఫారాన్ని సోమవారం అందజేశారు. ఇదిలావుండగా ఇప్పటివరకు ఎలాంటి పదవులను ఆశించకుండా పార్టీ ప్రతిష్ట కోసం చురుకైన పాత్ర పోషిస్తున్న జీవిత రాజశేఖర్ సినీ ఫీల్డ్‌లో అరంగ్రేటం చేసినప్పటి నుంచి ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్నారు. కోవిడ్ పరియడ్‌లో కూడా ఇదే ప్రాంతంలో ఎన్నో సమాజిక సేవా కార్యక్రమాలు చేశారు. సినిమా ఫీల్డ్‌కు చెందిన కార్మికులు, ప్రముఖులు ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకుని ఉండటం కూడా జీవితనకు కలిసొచ్చే అంశంగా పలువురు భావిస్తున్నారు. ముక్కుసూటిగా తన అభిప్రాయాన్ని చెప్పే జీవిత ఏ విషయంలోనైనా సంశయపడకుండా దూసుకుపోయే మనస్తత్వం ఆమెది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా జీవితను నిలబెడితే అధికార పార్టీ భారత రాష్ట్ర సమితిని జూబ్లీహిల్స్‌లో ఎదుర్కొనే అవకాశం ఉన్నదని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ రెండుసార్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. భారస హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు కూడా అయిన మాగంటి గోపినాథ్ హాట్రిక్ విజయం కోసం ఉవ్విళ్ళూరుతున్నారు. ఆయనను ఢీకొనాలంటే జీవిత లాంటి సెలబ్రిటీ, బలమైన అభ్యర్థి భారతీయ జనతాపార్టీకి ఎంతైనా అవసరం ఉన్నది. కొసమెరుపేమిటంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గంతో పాటు కూకట్‌పల్లి, ఖైరతాబాద్, సనత్‌నగర్, సికింద్రబాద్ నియోజకవర్గాలకు కూడా జీవిత రాజశేఖర్ దరఖాస్తు చేసుకోవడం విశేషం. పార్టీ నిర్ణయం మేరకు భాజపాలో ఎంత పెద్ద నాయకులైనా దరఖాస్తు చేసుకుంటేనే పోటీ చేసే అవకాశం ఉండడంతో జీవిత రాజశేఖర్ దరఖాస్తును పార్టీకి అందజేసినట్లు తెలిసింది. ప్రథమ ప్రాధాన్యతను కూకట్‌పల్లి లేదా జూబ్లీహిల్స్ నియోజకవర్గాలపై ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. పార్టీ ఎక్కడి నుంచి అవకాశం ఇచ్చినా పోటీ చేయడానికి ఆమె సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.




ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న బిజెపి నేతలు, చిత్రంలో కార్పొరేటర్ అమృత, మధుసూదన్‌యాదవ్ తదితరులు

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : మంత్రి తలసాని


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, అందుకు ఎన్ని నిదులైనా ఖర్చు చేస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో రూ. 1.96 కోట్లతో 9 అభివృద్ధి పనులను మంత్రి శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ముందుగా భోలక్‌పూర్‌లోని కృష్ణానగర్‌లో రూ. 18.85లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు, సుందరయ్య వీకర్స్ సెక్షన్‌లో రూ. 18.5 లక్షలతో సివరేజీ పైప్‌లైన్ పునరుద్దరణ పనులు, భోలక్‌పూర్‌లో రూ. 6లక్షలతో వాటర్ లైన్ పనులు, న్యూబోయిగూడలో రూ. 26.80లక్షలతో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు, డాన్‌బాస్కో కాలేజీ వద్ద రూ. 20.80లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయా ప్రాంతాలలో పాదయాత్ర జరుపుతూ ప్రజల సమ్యలు అడిగి తెలుసుకున్నారు. భోలక్‌పూర్‌లో గల ప్రభుత్వ స్థలంలో స్థానిక ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం రూ. 55 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గొల్లకొమురయ్య కాలనీలో ఇటీవలనే నిర్మించిన రోడ్డుపై నీరు ప్రవహిస్తుందని, సమస్య పరిష్కరించాలని స్థానికులు మంత్రిని కోరారు. సంబంధిత అధికారులను వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

## రాష్ట్రపతి నిలయంలో హైదరాబాద్ విమోచన ఉత్సవాలు

అల్వాల్, సెప్టెంబరు 11 ప్రభాతవవార్త: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో హైదరాబాద్ విమోజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులు పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 15, 16, 17వ తేదీలులో సాంస్కృతిక, కళారంగాలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నాట్లు రాష్ట్రపతి నిలయం వ్యవహారాలు ఇన్‌చార్జ్ రజనీ ప్రియ తెలిపారు. నగరంలోని వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సవాలులో పాలు పంచుకుంటారన్నారు. సాంస్కృతిక పోటీలులో పాల్గొనదలిచిన విద్యార్థులు ఈ నెల 14వ తేదీ లోపు ఆల్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దేశ భక్తి, సాంస్కృతిక అంశాలుతో పాటుగా ఆధునిక సాంకేతికపై పోటీలు నిర్వహిస్తామన్నారు. నాటకాలు, వ్యాకరణం, చిత్రలేఖనం, పాటలు, సంగీతం, ఖాదీ ఫ్యాషన్ షో, క్విజ్, వంటి అంశాలుపై ప్రధానంగా పోటీలుతో పాటుగా ఐక్యత ర్యాలీ ఉంటుందని తెలిపారు. రాష్ట్రపతి నిలయంలోకి పౌరులకు అనుమతి ఇచ్చిన తరువాత 40వేలు మంది సందర్శించినట్లు రజనీ ప్రియ తెలిపారు. విమోచన ఉత్సవాలు విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## ఆధ్యాత్మిక నృత్య సంప్రదాయంలో తాటకవధ-యాగసంరక్షణ నృత్యరూపకం


చిన్నారి కళాకారులతో అతిథులు రాంమూర్తి, పసుమర్తి, సాంబమూర్తి, కరుణాకర్‌గుప్తా, కల్లూరివెంకటేశ్వర్లు

నాంపల్లి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : తెలంగాణ నాట్యమేళం సంస్థ ఆధ్యాత్మిక, ఆరాధన, నృత్యసంప్రదాయం నాట్యమేళవింపుతో జాతిని ఉర్రూతలూగించిన చిరుతల రామాయణంకు మార్పులు కూర్పులతో మార్గ పద్ధతిలో శాస్త్రీయనాట్యంగా, తెలంగాణ నాట్యమేళంగా ప్రదర్శిస్తూ వస్తూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో నాట్యమేళ సంప్రదాయంలో 5గతులలో రూపొందించిన తాటకవధ-యాగసంరక్షణ నృత్యరూపకాన్ని శాస్త్రీయంగా ప్రదర్శించి చూపరులను ఆకట్టుకొని మెప్పించారు. 200 సంవత్సరాల చరిత్రగల మరుగున పడిపోయిన ఈ కళాఖండాన్ని కల్లూరి వెంకటేశ్వర్లు గత 20ఏళ్ల వెలుగులోకి తీసుకురావడానికి కృషిచేస్తూ ఎందరో కళాకారులను అద్భుతంగా తీర్చిదిద్దుతూ నేటి రాబోవు తరాలకు నాట్యమేళ కల్లూరి చిరుతల వాగ్గేయకారుడుగా రూపొందించి అందించడం హర్షదాయకమని, విశ్వవిద్యాలయం దీనిని సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుగా ప్రవేశపెడితే యువతరానికి నేర్చుకొనే అవకాశం కలుగుతుందని ముఖ్య అతిథి హైకోర్టు న్యాయవాది కె.రాంమూర్తి, విశిష్ట అతిథులు డా. పసుమర్తి శేషుబాబు, డా. సాంబమూర్తి, కరుణాకర్‌గుప్తా అన్నారు. చివరిగా అతిథులు కళాకారులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికి డబల్ బెడ్ రూమ్‌లు అందేలా చూస్తాం

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో అర్హులైన పేద వారికి డబుల్ బెడ్ రూమ్ అందేలా చూస్తామనీ కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్‌లో గల మెట్రో సమీపంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం లాంఛనంగా కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభలో కృష్ణారావు మాట్లాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో డబల్ బెడ్ రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి మార్చినాటికల్లా ఇల్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాని హామి ఇచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చేయడమే కాకుండా ట్రాఫిక్ రహిత కూకట్‌పల్లి ప్రాంతంగా తీర్చిదిద్దామన్నారు. నాలాల నిర్మాణం కోసం 500 కోటుల వెచ్చించి రిటర్నింగ్ వాళ్ళు నిర్మించడం జరిగిందన్నారు. కూకట్‌పల్లిలో దరఖాస్తు చేసుకున్న 3000 మందికి గృహలక్ష్మీ పథకం కింద రుణాలు అందజేయనున్నామన్నారు. ఉచితంగా మంచినీటి వసతి కల్పించన ఘనత కూడా బిఆర్ఎస్ ప్రభుత్వందేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఆయా డివిజన్ల కార్పోరేటర్లు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువ సేవకుల సమాహారం యువభారతి

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**


పురస్కారగ్రహీతలు సుధామ, ఎం.కె.రాములతో రమణాచారి, ఫణీంద్ర

నాంపల్లి, సెప్టెంబరు 11 ప్రభాత వార్త : నేటి సమాజంలో వయోధికులు కళా సాంస్కృతిక సంస్థలను అద్భుతంగా నిర్వహిస్తూ భారతీయ సంస్కృతిక, సంప్రదాయాలు, శాస్త్రీయ కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ విశ్వవ్యాప్తం చేస్తున్న తరుణంలో ఔత్సాహిక యువకులు యువ భారతిని అమోఘంగా నిర్వహిస్తూ సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని యువభారతి, యువభారతి ఫౌండేషన్ సంస్థలను, బాధ్యుల సేవలను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి కొనియాడారు. ఇదే తరుణంలో వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయాన్ని కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తుచేశారు. యువభారతి అధ్యక్షుడు డా. ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయంలోని రావిచెట్టు రంగారావు సభామందిరంలో జరిగిన ఇరివెంటి కృష్ణమూర్తి 90 జయంత్యుత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా కె.వి.రమణాచారి సంస్థ కార్యదర్శి జీడిగుంట తదితరులతో కలిసి ఇరివెంటి కృష్ణమూర్తి పురస్కారాన్ని సుధామకు, డా. తిరుమల శ్రీనివాసాచార్య, స్వరాజ్యలక్ష్మి ధర్మనిధి పురస్కారాన్ని డా. ఎం.కె.రాములను ఘనంగా సత్కరించి ప్రదానంచేసి అభినందించారు.

## వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి : ఎమ్మార్పీఎస్


అడ్డగుట్టలో ఎస్సీ వర్గీకరణ కోసం దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీవర్గీకరణ బిల్లు అమలుకు చట్టబద్ధత కల్పించాలని మాది రిజర్వేషన్ పోరాట సమితి కో-ఆర్డినేటర్ దప్పు మల్లికార్జున్ మాదిగ, ఉపాధ్యక్షులు వేణు గోపాల్ మాదిగలు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ అడ్డగుట్టలో ఎమ్మార్పీఎస్ మహాదీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 29 సంవత్సరాల నుంచి వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ ఉద్యమం చేస్తుంటే కేంద్రం నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుందన్నారు. ఈ నెల 18 నుంచి జరుగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహేశ్ మాదిగ, జంగిలి జగన్,సుజాత మాదిగ, యాదగిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

**స్టాండింగ్ కమిటీ మెంబర్ శాంతి సాయిజన్ శేఖర్**


స్టాండింగ్ కమిటీ మెంబర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో నాయిబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

నాచారం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: నాచారం నాయిబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జిహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. సోమవారం నాచారం నాయిబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను వివరించారు. నాయిబ్రాహ్మణులు ప్రతి నెల సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేసుకునేందుకు వార్డు కార్యాలయాన్ని ఇవ్వాలని కోరారు. అందుకు కార్పోరేటర్ సానుకూలంగా స్పందించారు. కుల వృత్తి కానివారు కూడా నాయిబ్రాహ్మణుల వృత్తిని చేస్తు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయిబ్రాహ్మణులకు అన్ని వేళల అందుబాటులో ఉంటామని కార్పోరేటర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కరణ్, శ్రీకాంత్, నరేష్, స్వామి, వెంకటేష్ తధితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఆర్, సైట్ 2లో కీర్తిరెడ్డి జూటూరు పర్యటన


సంత్ రవి దాస్ మహారాజ్ మోచి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కీర్తిరెడ్డి జూటూరు

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ ఎన్ఆర్ఆర్, సైట్ 2లో సోమవారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం భాజపా నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు పర్యటించారు. సంత్‌రవి దాస్ మహారాజ్ మోచీ పంచ్ కమిటీ సభ్యులను కలిసి వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. మహారాజ్ మోచీ పంచ్ కమిటీ సభ్యులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. కీర్తిరెడ్డికి వారి సమస్యల గురించి విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సంత్ రవి దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి కీర్తిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జూబ్లీ హిల్స్ నియోజకవర్గం కన్వీనర్ రాందారి బాబు, గణేష్ గౌడ్, జిట్టా శ్రీశైలం, మధుసూదన్, నవీన్, తేజ, మోచి కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజా స్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది : నాగులు

అడ్డగుట్ట,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ప్రజా స్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందని అందు వల్ల 18 సంవత్సరాలు పూర్తైన వారంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మోండా డివిజన్ బిఆర్ఎస్ నాయకులు నాగులు తెలిపారు. ఓటర్ల నమోదు కోసం బండి మెట్టులో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఓదెల సత్యనారాయణ,రాయ్ వెంకటేష్, జయరాజ్, అమర్, శ్రీనాథ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ రాజన్న గుట్టను సందర్శించిన రాజకీయ నాయకులు

**న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు**


ఖానాపూర్‌లోని రాజన్న గుట్టను సందర్శించిన బీజేపీ రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్‌గౌడ్ తదితరులు

నార్సింగి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఖానాపూర్‌లో ఉన్న చారిత్రక ఆలయ భూములను కాపాడేందుకు మావంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పలువురు రాజకీయ నాయకులు ప్రకటించారు. సోమవారం ఉదయం కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంత్‌రావ్ రాజన్న గుట్టను, శివాలయంను సందర్శించారు. శతాబ్దాల నుంచి ఉన్న ఆలయ భూములను తెలంగాణ సర్కారు లాక్కొని వేలం వేయాలనుకోవడం దారుణమన్నారు. ఆలయాల భూములను ఆలయాలకు వదిలిపెట్టి, అభివృద్ధి చేసుకుంటే మంచిదన్నారు. లేదంటే ఖానాపూర్ గ్రామస్థులకు అండగా కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమిస్తామని హనుమంత్‌రావ్ తెలిపారు. అలాగే బీజేపీ రాష్ట్ర నేత అంజన్ కుమార్‌గౌడ్, నార్సింగి మున్సిపల్ బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్‌లు రాజన్న గుట్టను సందర్శించి, ఆలయంలో ప్రత్యేక పూ జలు చేశారు. అనంతరం ఓమ్ నమఃశివాయ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలకు అదనంగా భూములు కేటాయించి అభివృద్ది చేయాలే తప్పా, వేల ఏళ్ల నుంచి ఉన్న భూములు లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను వేలం వేసి ఖజానా నింపుకుంటున్న సీఎం కేసీఆర్ ఖానాపూర్‌లోని మహిమాన్విత ఆలయంకు 5.ఎకరాల భూమిని వదిలిపెట్టి, రాకపోకలు సాగించేందుకు రోడ్లకు భూములు వదిలి వేలం వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ గండయ్య ముదిరాజ్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు తోల్‌కట్ట కృష్ణ, దేవాలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్, విఠల్‌రెడ్డి, దుద్దాల రాజు, మన్నె సురేష్ ముదిరాజ్, సందీప్‌రెడ్డి, తలారి రాములు, నవీన్, ధన్‌రాజ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతోనే సామాజిక న్యాయం

**ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్‌మాదిగ**


రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నేతలు

ధర్నాచౌక్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, ఎస్సీ వర్గీకరణను విస్మరించటం అంటే సామాజిక న్యాయాన్ని సమాధి చేయటమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. సోమవారం ముషీరాబాద్ ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లు ఈ పార్లమెంటు సమావేశాలలో ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షనుద్దేసించి ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ బీజేపీ ఇప్పటికైనా ఇచ్చిన హామీకి కట్టుబడి ఈ పార్లమెంటు సమావేశాలలో వర్గీకరణ బిల్లు పెట్టి, చట్టబద్ధత కల్పించి, తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన ప్రారంభం అయిన ఈ దీక్షలలో నాయకులు బుర్రజగదీష్ మాదిగ, గిన్నారపు శ్యాంరావుమాదిగ, ఇల్లెందుల ఎల్లయ్యమాదిగ, ఏనుగందుల పోచయ్య మాదిగ, అమ్ముగూడెం దశరథ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలి

**వ్యవస్థాపక అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్**


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చంద్రకుమార్, ఇంద్రసేన, రఘునాథ్, సూర్యకిరణ్

హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త: ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తా తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈనెల 17న (ఆదివారం ) బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి అధ్యక్షులు ఇంద్రసేన, రైతు సదస్సు నిర్వాహణ కమిటి అధ్యక్షులు ఎం.రఘునాథ్‌లతో కలిసి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ రైతుల క్షేమం, ఆత్మహత్యల నివారణ, రైతుకుటుంబాలకు అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఏర్పాటైందన్నారు. ఇప్పటికే ఆత్మహత్యల నివారణ కొరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రంగాపూర్ నుంచి పాదయాత్ర నిర్వహించి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ఒక్కొక్కరికి 10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశామన్నారు. అలాగే రైతులకు ఉచిత ఎరువులు పంపిణీ చేసి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కోశాధికారి సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయ్‌నిధి వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి ధర్నా


ప్రసంగిస్తున్న బిజెపి హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: సనాతన ధర్మంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమా రుడు ఉదయ్ నిధి చేసిన వ్యాఖ్య లను తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి హైద రాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పేర్కొన్నారు. అధికారదాహంతో ప్రశాంతంగా ఉన్న సమాజంలో చిచ్చు పెట్టేందుకు కొంతమంది చేస్తున్న కుట్రలు మానుకోవాలని ఆయన అన్నారు. ఉదయ్‌నిధి వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని అలీకేఫ్ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. సనాతన ధర్మంపై ఉదయ్‌నిధిచేసినవ్యాఖ్యలు చాలా దుర్మార్గమని విమర్శించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బిజెపి నేతలు ఆనంద్ గౌడ్, యశ్వంత్, రవీందర్‌యాదవ్, శేర్‌సాగర్, సునీల్, మనోజ్, గణేష్ పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో ముగిసిన శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవాలు


వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఐదు రోజుల పాటు వివిధ రకాల పూజలందుకున్న స్వామివారికి ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో విశేషంగా పూజాది కార్యక్రమాలను నిర్వహించి కైంకర్యాలను సమర్పించారు. సోమవారం ప్రబంధ సేవాకాలం, ఆరగింపు, శాత్తుమొర, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

## సమ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

చిక్కడపల్లి, సెప్టెంబర 11 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక విశ్వగురువులు, ది సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువులు గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వి.కామాక్షి ప్రసాద్, డాక్టర్ బి.సుజాత శేఖర్, పి.కృష్ణప్రదీప్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో గురువులను పూజించుకోవడం మంచి సంప్రదాయమని అన్నారు. సమసమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ముఖ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ట్రస్ట్ సభ్యులుపాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ఎసిపి యాదగిరి**


ప్రసంగిస్తున్న చిక్కడపల్లి ఏసీపీ ఏ.యాదగిరి

చిక్కడపల్లి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గణపతి నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాని చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి సూచించారు. సోమవారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చిక్కడపల్లి పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ యాదగిరి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలంటే యువత సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి నిమజ్జనోత్సవం పూర్తయ్యే వరకు ప్రణాళికాబద్దంగా జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్లు పిడమర్తి నరేశ్, జహంగీర్‌యాదవ్, డిఐ వెంకటరెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు. మండపాల వద్ద విద్యుత్తు సరఫరా, ఫైర్ సేఫ్టీ, ఇతర జాగ్రత్తలను తప్పకుండా తీసుకోవాలని ఏసీపీ సూచించారు.

## పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టాలని 21న చలో ఢిల్లీ

**రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ , ఆది మల్లేశం పటేల్

హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త: ఒకే నేషన్,ఒకే ఎలక్షన్‌కు ప్రాధాన్యత నిస్తూనే ఈప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా బిల్లును ప్రవేశపెట్టి బిసి మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని డిమాండ్ ఈనెల 21న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కాచిగూడలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, బిసిసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆది మల్లేశం పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిధిగా హాజరై ఛలోఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో బిసిల నుంచి తిరుగుబాటు రాకముందే డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కేంద్రం తెచ్చిన మహిళా బిల్లులో బిసి మహిళలకు ప్రాతినిథ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత ఉండదన్నారు. ఇప్పటికే ఈబిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని లోక్‌సభలో కకూడా పెట్టి పూర్తిచేయాలన్నారు. మహిళా బిల్లుగురించి గొంతులు చించుకుని మాట్లాడే పార్టీలు బిసి మహిళలు గురించి, వారికి జరుగుతున్న అన్యాయం, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు అన్ని రాజకీయ పార్టీలు 50శాతం టికెట్లు ఇవ్వాలని లేదంటే ఆయా పార్టీల బరతం పడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్, నీలం వెంకటేష్, రాజ్‌కుమార్, సుధాకర్ ముదిరాజ్, అంజి, అనంతయ్య, నిఖిల్‌పటేల్, చిగుర్ల శ్రీనివాస్, స్వరూప, గంగాభవాని,పృథ్వీగౌడ్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో టిడిపి నాయకుల నిరసన


కార్యక్రమంలో పాల్గొన్న టిటిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్.ఆవుల భరత్ ప్రకాష్,రవీంద్రచారి

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : టిడిపి జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడకు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం పాతబస్తీ లాల్‌దర్వాజ చౌరస్తా వద్ద పాతబస్తీకి చెందిన టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న టిటిడిపి రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్,పెద్దోజు రవీంద్రచారిలు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై ఎపి ప్రభుత్వం సిఐడిని అడ్డం పెట్టుకుని కక్ష్య సాధింపు చేస్తున్నదని, చంద్రబాబు నాయుడుపై కేసు పెట్టడం సిగ్గు చేటు అని తెలిపారు.రానున్న ఎన్నికల్లో ఎపి ప్రజలు వైసిపికి తగిన బుద్ది చెప్పనున్నారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జోగే ందర్ సింగ్,జి.చంద్రశేఖర్, శ్యామ్‌సుందర్, చంద్ర కుమార్,సల్లా రాజ్‌కుమార్,మహ్మద్ చాంద్ పాషా, నర్సింగరావు, మాధవరావు,శ్రీరాములతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**బాలానగర్ తహశీల్దార్ శ్రీనివాస్**

బేగంపేట సెప్టెంబరు 11,ప్రభాతవార్త : 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి తన ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బాలానగర్ తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు.బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ లోపు తప్పని సరిగా ఆన్‌లైన్ లేదా సంబంధిత బ్లాక్ లెవల్ ఆఫీసర్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని వివరించారు. ఓటరు నమోదు కార్యక్రమంపై ఓటు హక్కుపై వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓటరుగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ రాజారెడ్డి,శ్రవణ్‌కుమార్, జి.నర్సింహులు, డాక్టర్ సరిత,ఎం.మధు సూధన్‌రావు, డా.సరోజి చక్రవర్తి,డి.ప్రసన్న, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2,3,4,5వాలెంటీర్లు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్‌బినగర్ బిఆర్ఎస్‌లో ముసలం

## అభ్యర్థిని మార్చాలంటున్న రామ్మోహన్‌గౌడ్ వర్గం

## లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్‌కే మా మద్దతు అంటున్న మాజీ కార్పొరేటర్లు, నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌గౌడ్ తదితరులు

**ఎల్‌బినగర్ జోన్ ప్రతినిధి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌రెడ్డిని ప్రకటించడంపై అధిష్టానం పునరాలోచన చేయాలని ఎల్‌బినగర్ బిఆర్ఎస్ ఇంఛార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలు, ఉద్యమకారులను పట్టించుకోకుండా, తన వర్గం వారికే పదవులను కట్టబెడుతూ అసలైన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న సుధీర్‌రెడ్డి ప్రజల్లో, పార్టీలో మద్దతు కోల్పోయారని ఆయన ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తాను పోటి చేయనని, తన భార్య మాజీ కార్పొరేటర్ లక్ష్మిప్రసన్నను బరిలోకి దింపుతామని స్పష్టం చేశారు. మహిళా కోటలో తాము లక్ష్మి ప్రసన్న పేరును సూచిస్తున్నామని, సుధీర్‌రెడ్డిని కాకుండా లక్ష్మిప్రసన్న అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం తన నివాసంలో రామ్మోహన్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని, కబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. సుధీర్‌రెడ్డి పార్టీలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైందని, ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదని, గతంలోనే కెసిఆర్, కెటిఆర్‌లు ఫ్లైఓవర్‌లు, రోడ్లను మంజూరు చేయడం జరిగిందని, అయితే సుధీర్‌రెడ్డి మాత్రం తాను చేసాననిచెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు దిగుతూ పార్టీ పరువు తీస్తున్నారన్నారు. తాను 11మంది కార్పొరేటర్లను గెలిపించుకున్నానని, అయితే సుధీర్‌రెడ్డి మాత్రం ఒక్కరిని కూడా గెలిపించుకోలేక పోయారన్నారు. బిసి మహిళగా లక్ష్మిప్రసన్నకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. సుధీర్‌రెడ్డిని పార్లమెంటు సభ్యుడిగా పంపి ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్ష్మిప్రసన్న పేరును ఖరారు చేయాలని ఆయన కెసిఆర్, కెటిఆర్‌లను కోరారు. తాము పార్టీని ధిక్కరించడం లేదని, పార్టీ అభివృద్ధికోసమే తాము పాటుపడుతున్నామని వారు స్పష్టం చేశారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ తాను ఒక ఎస్‌టి కార్పొరేటర్‌ను అని, తనకు ఎమ్మెల్యే ఎలాంటి గౌరవమివ్వడం లేదని భోరున విలపించారు. ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందని, తాను కెటిఆర్ సమక్షంలో పార్టీలో చేరడాన్ని ఎమ్మెల్యే జీర్ణించుకోలేక పోయారని, అందువల్లే తనను దూరం పెడుతున్నారని, అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపుకోసం తాను కృషిచేస్తానని, మహిళా అభ్యర్థికి టికెట్ కేటాయించాలని కోరారు. మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్‌గౌడ్, సామ రమణారెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, నాయకురాలు మల్లారపు శాలినిలు మాట్లాడుతూ ఇతర పార్టీల నుంచి వచ్చిన సుధీర్‌రెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, ఒకవర్గాన్నే పెంచి పోషిస్తున్నారని, దీనివల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్నారు. రౌడీయిజం, గుండాయిజం చేయడం కాదని, గాంధీయిజం ఉండాలని అన్నారు. ఆత్మగౌరవం చంపుకుని తాము ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పని చేయలేమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాపై అక్రమ కేసులు బనాయిస్తూ, సెకండ్ క్యాడర్‌ను ఎదగనీయకుండా, కార్యకర్తలను పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడలు పోతున్నారని వారు ధ్వజమెత్తారు. తమ మద్దతు లక్ష్మిప్రసన్నకే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మిప్రసన్న, నాయకులు వెంకటకృష్ణ, కత్తుల రాంబాబు, జాని, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం హుండీల లెక్కింపు

**సైదాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం హుండీలను సోమవారం లెక్కించారు. హుండీల ద్వార దేవస్థానానికి రూ. 31,54,065లు, వంద అమెరికాడాలర్లు, పది బ్రిటిష్‌పౌండ్స్ సమకూరాయి. రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ టి.శేఖర్, కార్యనిర్వాణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, దేవాలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డిల పర్యవేక్షణలో హుండీలు లెక్కించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్ యాదవ్, ఛాతిరి మధుసాగర్,గూడూరు మధుసూధన్‌రెడ్డి, చీర తిరుమలేష్, మేకల యాదగిరి, బబ్బూరి ఆనంద్ కుమార్ గౌడ్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఏ బ్లాక్ డివిజన్ అధ్యక్షుల నియామకం

**ఉప్పల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ డివిజన్ అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ అధ్యక్షుల జాబితాలను ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎం.పరమేశ్వర్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు. నాచారం డివిజన్ అధ్యక్షునిగా వి.ప్రకాష్‌రెడ్డి, చిలుకానగర్ డివిజన్ కొంపల్లి బాలరాజు, హబ్సిగూడ డివిజన్ జి.విజయ్‌కుమార్, రామంతాపూర్ డివిజన్ ఎం.డి.రఫీక్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షునిగా బాకారం లక్ష్మణ్‌లను నియమించినట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందని తెలిపారు.

## ఘనంగా మార్వాడీల బచ్చబరాస్ వేడుకలు

**ఉప్పల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ సాయిరాంకాలనీలో మార్వాడి మహిళా మండల్ సమాజ్ ఆధ్వర్యంలో బచ్చబరాస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం గీత మాట్లాడుతూ శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా 6 రోజుల తర్వాత బచ్చబరాస్ వేడుకలు నిర్వహిస్తారని, మర్వాడీ మహిళ సమాజం గోమాతను పూజించడం సంప్రదాయంగా వస్తుందన్నారు.మార్వాడీ మహిళలు ఆనందోత్సవాలతో వేడుకలు చేసుకోవడం అభినందనీయమన్నారు.

## ఎంపి కేశవరావుతో బండారి లక్ష్మారెడ్డి బేటి

**ఉప్పల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావుతో సోమవారం ఉప్పల్ బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేశవరావు సహకారంతో వచ్చే ఎన్నికల్లో నియోజక వర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తామన్నారు. తెలంగాణ సాధనలో కేశవరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సూరం శంకర్, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మలక్‌పేట నియోజకవర్గం నుండి బిజెపి టిక్కెట్‌కు దరఖాస్తు చేసుకున్న నాయకులు



దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న వినోద్‌కుమార్, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి,

**మలక్‌పేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గ బిజెపి టికెట్‌ను తనకు కేటాయించాలని పలువురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. మలక్‌పేట టికెట్ కోసం బిజెపి సీనియర్ నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డి డివిజన్‌నుండి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మితోపాటు నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. **శ్రీకరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో...** మలక్‌పేట నియోజకవర్గంనుండి బిజెపి టికెట్‌ను తనకు కేటాయిస్తే భారీ విజయం సాధిస్తామని మాల్యాద్రి శ్రీకరం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మలక్‌పేటనుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. **వంజరి వినోద్ ఆధ్వర్యంలో...** మలక్‌పేట నియోజకవర్గ బిజెపి టికెట్‌ను తనకు కేటాయించాలని కోరుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంజరి వినోద్‌కుమార్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలి



ప్రదర్శనలో అంశాలగురించి వివరిస్తున్న విద్యార్థులు

**మలక్‌పేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి కృషి చేస్తున్నామని దిల్‌సుక్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ బి.మధుసూదన్ పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన ఎడ్యుకేషనల్‌మెడల్స్ ఎగ్జిబిషన్ ఐడియా ఎగ్నైట్ వైజ్ఞానిక ప్రదర్శనను ప్రిన్సిపల్ మధుసూదన్ ముఖ్య అతిథిగా విచ్చేసి డీన్ ఎస్.భాగ్యలక్ష్మి, హెచ్‌ఓడి పద్మజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ మేధస్సుకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. బిసిఎ, బిబిఎ, బి.కాం విద్యార్థులు వ్యవసాయం, పరిశ్రమలు, ఆర్‌బిఐ, ఆయిల్ రిఫైనరీ తదితర వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించగా అవి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులను అందజేసారు.

## సమస్యలు పరిష్కరించాలని జలమండలి జిఎంకు కార్పొరేటర్ అరుణ వినతి



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** స్థానిక సమస్యలు పరిష్కరించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం కార్పొరేటర్ కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగోల్ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీలు, త్రాగునీటి సమస్యలు త్వరగా పూర్తి చేయాలని కోరారు.నాగోల్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. కాలనీ వాసులకు ఇబ్బంది కలగకుండా త్వరగా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అన్నారు. అందుకు స్పందించిన ఆయన త్వరగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కేశిరెడ్డి పద్మరెడ్డి, దప్పు రాజు, మైనం రాజేశ్వర్, రావుల శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన

**సైదాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ ఈస్ట్‌మారుతీనగర్ లోని పోచమ్మతల్లి ఆలయంలో నూతనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సత్తిరెడ్డి,లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సామ రంగారెడ్డి, రమాదేవి, గోకుల్ సరోజ, ప్రభాకర్, యశ్పాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** కాలనీలో ఏమైనా సమస్యలుంటే తనదృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ శ్రీలక్ష్మినర్సింహాస్వామి ఫణిగిరి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించి కాలనీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో చైతన్యపురిడివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు బాశెట్టి అజయ్‌కుమార్, సెక్రటరీ నరేందర్‌రెడ్డి, కోశాధికారి రవి కుమార్, ఉపాధ్యక్షులు స్వామి, వెంకటచారి, నర్సింహారెడ్డి, సభ్యులు అంజయ్య, శ్రీనివాస్‌యాదవ్, జాగ్‌భూషణ్‌సింగ్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు : యాదయ్య



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు

**తుర్కయంజాల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** భూమికోసం,భుక్తికోసం దొపిడీ, వెట్టిచాకిరి వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన తుర్కయంజాల్ చౌరస్తాలో కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించడంతోపాటు తెలంగాణ సాయుధ పోరాట స్మృతులను గుర్తు చేసారు. దున్నే వాడికి భూమి కావాలని, వెట్టిచాకిరి నిర్మించాలని నిజాంకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రాణ త్యాగాలు చేశారన్నారు. సెప్టెంబర్ 11నుండి 17వరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ముగింపు సందర్భంగా 17వ తేదీన హైదరాబాదులో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శివకుమార్, నాయకులు గువ్వల రాజు, భాస్కర్, గోవర్ధన్, పల్లపు శివకుమార్ ఆనంద్, శ్రీకాంత్, కోటియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సమావేశం: మురుకుంట్ల

**ఎల్.బి.నగర్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:**మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లెలగూడలోని ఎస్‌వైఆర్ గార్డెన్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ తెలిపారు.ఈ సమావేశానికి మంత్రి సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రారంభోత్సవం గురించి రాబోయే ఎన్నికల్లో అనుసరించే వ్యూహాల గురించి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** శ్రావణమాసం చివరిసోమవారం సందర్భంగా మల్కాజ్‌గిరి డివిజన్ పరిధిలోని మారుతినగర్ శివాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్వామివారికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకన్న, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు సతిష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, సంజయ్, రామూయాదవ్, సంతోష్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు

**సిసి రోడ్డు పరిశీలన : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్...** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ 20 లక్షల రూపాయలతో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు, సంపత్‌రావు, కిషోర్, కాలని అధ్యక్షుడు బ్రహ్మయ్య, దేవేందర్, గోపాల్‌రావు, నర్సింగ్‌రావు, ప్రకాష్‌జైన్ పాల్గొన్నారు.

## సనాతన ధర్మంపై దాడి చేస్తే సహించేది లేదు : మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**ఉప్పల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** తమిళనాడు మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో సోమవారం చిలుకానగర్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ప్రభాకర్, కార్పొరేటర్ కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి, బిజెపి అర్బన్ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్వీఎస్ఎస్ మాట్లాడుతూ మంత్రి ఉదయనిధి వ్యాఖ్యలు సనాతన ధర్మంపై దాడి అవుతుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌నేతలు ఉదయ్‌నిధి వ్యాఖ్యలను ఖండించకపోవడం సబబు కాదన్నారు. హింధూ సంస్కృతిపై అనుచిత వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. డిఎంకె పార్టీని వెంటనే నిషేదించాలని డిమాండ్ చేశారు. హింధు ధర్మం జోలికి వస్తే ప్రతి ఒక్కరు శివాజీ వారసులమై లౌలికవాదులను బొంద పెడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మారెడ్డి, సతీష్, జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం, జిల్లా అధికారప్రతినిధులు గోపాల్, రామ్‌ప్రదీప్, గోనె శ్రీకాంత్, పలువురు బిజెపి డివిజన్ల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా నిర్వహించే విశ్వకర్మ జయంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి



విశ్వకర్మ మహాసభ సమావేశంలో పాల్గొన్న సంఘం నేతలు

**ఉప్పల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా నిర్వహించే విశ్వకర్మ జయంతిని జాతీయ పర్వదినంగా గుర్తించి అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు అశ్వినీకుమార్ శర్మ కోరారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విశ్వకర్మ మహాసభ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ప్రధాని మోడీ ఈనెల 17వ తేదిన విశ్వకర్మ కౌశల్ యోజన పథకాన్ని ప్రారంభిస్తున్నారని, ఆయనకు విశ్వకర్మ సంఘం తరపున ధన్యవాదలు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విశ్వకర్మ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొ.సుభాష్‌చంద్రబోస్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజమౌళిచారి, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌శర్మ, పలువురు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా అనుకిరణ్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామానికి చెందిన చామ అనుకిరణ్‌రెడ్డిని నియమించారు. ఈమేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి పాటుపడాలని సూచించారు. అనుకిరణ్‌రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## మాస శివరాత్రి సందర్భంగా మహా మృత్యుంజయ హోమము, లక్ష బిల్వార్చన

**వనస్థలిపురం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** వనస్థలిపురం శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలోని శ్రీ బ్రహ్మంగారి దేవాలయంలో ప్రతిష్ఠించిన స్పటిక శివలింగానికి సెప్టెంబర్ 13వ తేదీ మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 8 గంటలనుండి మహా మృత్యుంజయ హోమము, లక్ష బిల్వార్చన, ఇతర కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బి.అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.ప్రభాకర్, సభ్యులు డి. లక్ష్మారావు, మిట్ట రామ్మోహన్, కంచి కృష్ణమోహన్,బాలేశ్వర్, సురేష్, బ్రహ్మచారి, అశోక్‌కుమార్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వనసలిపురంలో చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి నాయకుల రాస్తారోకో



వనస్థలిపురం చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ ఇతర నాయకులు

**వనస్థలిపురం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** టిటిడిపి ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.వి.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ వనస్థలిపురం ఎన్టీఆర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకట్‌గాంధీ, విజయనేత, మురళీధర్‌రెడ్డి, గిరియాదవ్, రమాకాంత్‌గౌడ్, మెల్లం శ్రీనివాస్, బేగా రవి, శేఖర్, సుధాకర్, ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** హస్తినపురం డివిజన్ పరిధిలోని నల్ల పోచమ్మ దేవాలయ ఆవరణలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ధర్మకర్త నారగొని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో 200 మంది బీజేపీ నాయకులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లోకి చేరారు. ముఖ్యంగా బీజేపీ పార్టీలో చురుకుగా పని చేసే కందకట్ల శివకుమార్ రెడ్డి, పెండ్యాల మధుసాగర్, వాకిటి సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆశయాలు, వారు చేసే అభివృద్ధినచ్చి బిఆర్ఎస్‌లోకి రావడం జరిగిందని తెలిపారు.అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి ఈ పార్టీలో చేరడం జరుగుతుందని, సాధించుకున్న తెలంగాణలో అన్ని రంగాల్లో విజయాలను సాధించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అనేక అద్భుతాలు సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఆందెజు సత్యం చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌రెడ్డి, ఉద్యమకారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు లేకుండా చూస్తా : కౌన్సిలర్ విద్యావతి

**హయత్‌నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** వార్డు పరిధిలోని అన్ని కాలనీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. వార్డుపరిధి ఆపిల్ అవెన్యూ, వెంకటేశ్వర కాలనీలలో కృష్ణనీటి సరఫరాను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాగునీరు, డ్రైనేజీ సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, తరువాత సీసీరోడ్లు, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలలో నీరు నిలువకుండా చూసుకోవాలని తద్వారా వ్యాధులను దరి చేరకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు శ్రీధర్, ఏఈ భగవంతరావు ఆయా కాలనీల అధ్యక్షులు నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో లక్ష్మారెడ్డి పర్యటన



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

**రామంతాపూర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలోని శ్రీరామకాలనీలో మహంకాళి అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కాలనీలో పలు సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మ వారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం జనప్రియ, శాంతినగర్ కాలనీవాసులతో పలు సమస్యలపై చర్చించారు. నల్ల పోచమ్మ అమ్మవారి ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. పబ్లిక్ స్కూల్ వద్ద ఉన్న ముత్యాలమ్మ ఆలయం పునః నిర్మాణ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, మధుసూధన్‌రెడ్డి, ఆలే రమేష్, చంబు సాయి, తూట్ నరసింహా, వెంపటి శ్రీనివాస్, మహేందర్, రాజు యాదవ్, సాలార్, సూరం శంకర్, బోసాని పవన్, నరేష్, జహంగీర్, చాంద్‌పాషా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టాలు తీరాలంటే బీజేపీ రావాలి: అందెల

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ప్రజల కష్టాలు పోవాలంటే బిజెపికి అధికారంరావాలని, బిఆర్ఎస్‌కు విఆర్ఎస్ ప్రకటించాలని మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పేర్కొన్నారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమం సోమవారం ఆర్కేపురం డివిజన్ హరిపురికాలనీలో ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదవ రోజు కొనసాగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ఆడపడుచులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని వివరించారు.ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని కోరారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్‌రెడ్డి, కడారి జంగయ్యయాదవ్, ముంతా రాములు, సిద్దూముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

## చంపాపేట డివిజన్ టిడిపి అధ్యక్షుడిగా రవీందర్



బైగళ్ల రవీందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణప్రసాద్

**సైదాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎల్‌బినగర్ టిడిపిఇంఛార్జి ఎస్వీ కృష్ణప్రసాద్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ నూతన అధ్యక్షుడిగా బైగళ్ల రవీందర్, ఉపాధ్యక్షులుగా బీసుకుంట్ల సంతోష్‌గౌడ్, ఆర్.కృష్ణ, వేణుబాబు, ప్రధాన కార్యదర్శిగా సత్తిరెడ్డి, కోశాధికారిగా కట్ట యాదగిరితో ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చంపాపేట డివిజన్‌లో టిడిపికి మెజార్టీ ఓట్లు దక్కేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రకాష్ ముదిరాజ్, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు ముత్యాల సత్యనారాయణ, ఐటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు సునీల్‌బాబు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గ బిజెపి మేనిఫెస్టో కమిటి చైర్మన్ చంద్రమౌళి రాజీనామా

**ఉప్పల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం బిజెపి మేనిఫెస్టో కమిటి చైర్మన్ బి.చంద్రమౌళి సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బి.చంద్రమౌళి మాట్లాడుతూ ఉప్పల్ నియోజవర్గంలో దీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్నానని, అయితే పార్టీలో తనకు గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. చైర్మన్‌గా గత నెల 6వ తేదిన నియమించారని, చైర్మన్ అంటే ఒకరేనా అని ఆయన ప్రశ్నించారు. నెల రోజులు దాటినా తను ఏ సమావేశాలకు ఆహ్వానించలేదని, ధర్నాలు,ఇతర కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పదవి ఎందుకు ఇచ్చారో తెలియడం లేదని, పొమ్మనలేక పొగ పెడుతున్నారని, అయినప్పటికి పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు. తనకు సహకరించిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.